క్లుప్తంగా

వేపాడ తహసీల్దార్‌గా సత్యం



బి. సత్యం

వేపాడ: మండల తహసీల్దార్‌గా బంకపల్లి సత్యం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గరివిడి మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ కె.ప్రసన్నకుమార్‌ను తెర్లాం మండలానికి బదిలీ చేశారు.

ఎస్.కోట తహసీల్దార్‌గా...



ఎస్.కిరణ్‌కుమార్

శృంగవరపుకోట: ఇటీవల ఎన్నికల కమిషన ఆదేశాల మేరకు జిల్లాలో రెవెన్యూ అధికారుల బదిలీలు జరిగాయి. అందులో భాగంగా బొబ్బిలి తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎస్.కిరణ్‌కుమార్‌ను ఎస్.కోటకు బదిలీ చేశారు. గత నెల 25న బదిలీల ఉత్తర్వులు విడుదల కాగా శనివారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన డి.శ్రీనివాసరావును గరివిడి మండలాలనికి బదిలీ చేశారు.

ఆధార్ కేంద్రం పునరుద్ధరణ



గర్భాం సచివాలయంలో ఆధార్ సేవలు అందిస్తున్న సిబ్బంది

మెరకముడిదాం: మండలంలోని గర్భాం సచివాలయంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని అధికారులు శనివారం పునరుద్ధరించారు. ఇటీవల రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. గర్భాం, సాతాంవలస సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు పనిచేయడంలేదని మంత్రి బొత్సకు గతంలో ఫిర్యాదులు అందడంతో ఈ సమీక్ష సమావేశంలో అధికారులపై మంత్రి బొత్స ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆధార్ సేవల కోసం ఈ గ్రామ సచివాలయాల పరిధి ప్రజలు చీపురుపల్లి వెళ్లాల్సి వస్తోందని, వెంటనే సమస్యను పరిష్కరించాలని అధికారులకు మంత్రి బొత్స సూచించారు. దీంతో అధికారులు స్పందించి గర్భాం సచివాలయంలో ఆధార్ సేవలను అందుబాటు లోకి తీసుకువచ్చారు.

డ్రోన్‌తో పురుగు మందుల పిచికారీపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ, రెడ్డీస్ ఫౌండేషన్ సిబ్బంది

శృంగవరపుకోట: డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డ్రోన్‌తో పురుగు మందు పిచికారీపై మండలంలోని సంతగవిరమ్మపేట, కాపుసోంపురం గ్రామాల్లో రైతులకు ఏఓ కె.రవీంద్ర నేతృత్వంలో శనివారం అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ చేయడం వల్ల కూలీల ఖర్చు తగ్గుతుందని, తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పురుగుల మందు పిచికారీ చేయవచ్చని చెప్పారు. చేను అంతటికీ పురుగు మందు ఒకేలా అందుతుందని, దీనివల్ల చీడపీడలను సమగ్రంగా ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుందన్నారు. వీఏఏ రవి, రెడ్డీస్ ఫౌండేషన్ సర్వీస్‌పైలట్స్ కృష్ణ, ఉదయ్, ధనుంజయ్, ఏసు పాల్గొన్నారు.

4న ఇసుక వేలం

గుర్ల: మండలంలోని కోటగండ్రేడు సమీపంలో పోలీసులు గతంలో సీజ్ చేసిన 60 టన్నుల ఇసుకను సోమవారం వేలం వేయనున్నట్లు గుర్ల ఎస్‌ఐ భాస్కరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనదలిచేవారు ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బందిని సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులాహ్వానం

వేపాడ: స్థానిక మోడల్ స్కూల్‌లో 2024–25 విద్యాసంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆదివారం నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మార్చి 31 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఏప్రిల్ 21న ఉదయం 10 గంటల నుంచి 12 గంటలవరకు ప్రవేశపరీక్ష నిర్వహిస్తామని, అయిదో తరగతి స్థాయి సిలబస్‌తో ఇంగ్లిష్, తెలుగు మీడియంలో పరీక్ష ఉంటుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం అయిదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు రూ.75 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు పాఠశాల పని దినాల్లో సంప్రదించాలని సూచించారు.

నేడే పల్స్‌పోలియో



గుర్ల: ఎంపీడీఓ కార్యాలయంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీడీఓ వెంకటరమణ, వైద్యాధికారి చెన్నయ్

• ఏర్పాట్లు చేసిన అధికారులు



వేపాడ: వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డాక్టర్ ధరణి, వైద్య సిబ్బంది



చీపురుపల్లిరూరల్(గరివిడి): కోడూరులో నిర్వహించిన ర్యాలీలో గరివిడి మండల ప్రత్యేకాధికారి విశ్వేశ్వరరావు, ఎంఈఓ రామారావు, డాక్టర్ రాజ్యలక్ష్మి,తదితరులు



బొండపల్లి: గరుడుబిల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న బొండపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది,విద్యార్థులు



దత్తిరాజేరు: వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కె.కొత్తవలస వైద్యాధికారి రఘు



శృంగవరపుకోట: ఎస్.కోటలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న కొట్టాం వైద్య సిబ్బంది

పల్స్‌పోలియో కార్యక్రమం పట్టణాలు, అన్ని గ్రామాల్లో ఆదివారం నిర్వహించనున్నారు. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. పలు పీహెచ్‌సీల వైద్యాధికారులు, వైద్యసిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు శనివారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. సంబంధిత వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ అప్పుడే పుట్టిన పిల్లల నుంచి 5 ఏళ్ల లోపు పిల్లలందరికీ తప్పక పోలియో చుక్కలు వేయించాలని వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశవర్కర్లకు సూచించారు. ఆదివారం అందుబాటులో లేని పిల్లలకు 4,5వ తేదీల్లో వారి ఇళ్లకు వెళ్లి పోలియో చుక్కలు వేయాలని చెప్పారు.

– సాక్షి నెట్ వర్క్

ప్రతి ఇంటికీ మేలు చేశాం...



లబ్ధిదారులకు సీఎం జగన్ సందేశ పత్రాన్ని అందజేస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి, నాయకులు,అధికారులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల ద్వారా మేలు జరిగిందని ఎంపీపీ మీసాల విజయలక్ష్మి అన్నారు. మండలంలోని కుమరాం పాలవలస గ్రామంలో శనివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, కుటుంబాల వారీగా చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పేద ప్రజల సంక్షే మంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సమప్రాధాన్యం ఇచ్చారన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. సీఎం జగన్ నెలకొల్పిన గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలన్నీ గ్రామాల్లోనే అందుతున్నాయని, వలంటీర్ వ్యవస్థ ద్వారా పథకాలు ఇంటి ముంగిటకే అందుతున్నాయన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన కొనసాగాలంటే సీఎం జగన్‌ను మళ్లీ ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, వైస్ ఎంపీపీలు జి.వెంకట అప్పలరాజు, గుడివాడ శ్రీరాములునాయుడు, నాయకులు పొన్నాడ కుమార్, ఎలకల అప్పలనాయుడు, ఎడ్ల అప్పారావు, కంది శ్రీనివాసరావు, జి.రాంబాబు, తమ్మినాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేత్ర వైద్యశిబిరం రేపు

గజపతినగరం: మండల కేంద్రంలోని మెంటాడ జంక్షన్‌లో ఈ నెల 4వ తేదీన సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ ఫౌండేషన్ కార్యదర్శి రేవంత్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి , జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈశిబిరాన్ని గజపతినగరం,పురిటిపెంట, సమీపగ్రామాల ప్రజలు సద్వినియోగించుకోవాలని సూచించారు. వివరాలకు 77023 58809 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభం



పరీక్ష కేంద్రంలోకి వెళుతున్న వేపాడ గురుకుల పాఠశాల విద్యార్థినులు

వేపాడ: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళా శా ల కేంద్రంగా నిర్వహించిన పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా ముగిశారు. పరీక్షలకు 220 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 194 మంది హాజరయ్యారని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ తెలిపారు.

కన్వర్జెన్సీ సమావేశం



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ

వేపాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల కన్వర్జెన్సీ సమావేశం మండల ప్రత్యేకాధికారి పి.ఎస్.వి.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. విద్య, వైద్యం, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, ఉపాధి, ఐకేపీ, తదితర శాఖలపై సమీక్షించారు ప్రత్యేక అధికారి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష–2లో భాగంగా గ్రామాల్లో వైద్య శిబిరాలను విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, 'జగనన్నకు చెబుదాం'లో ప్రజలు అందించిన అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలని అన్నారు. తహసీల్దార్ బి.సత్యం తదితరుల పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి

గజపతినగరం: గజపతినగరం, పురిటి పెంట పంచాయతీల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు పెంచాల ని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి పంచాయతీల పాలకవర్గాన్ని కోరారు. స్థానిక గ్రంథాలయం సమీపంలో కార్మికులతో కలిసి శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గజపతినగరం,పురిటిపెంట పంచాయతీల్లో సుమారు 40 మంది కార్మికులు పనిచేస్తున్నారని, పెరిగిన ధరలకు అనుగుణంగా వీరందరికీ జీతాలు పెంచాలన్నారు. కార్మికులు కనకరాజు, నాగేశ్వరరావు, జి.కృష్ణ, కోటి పాల్గొన్నారు.

ఎస్.కోటలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలి



ఆందోళన చేస్తున్న గిరిజనులు, సీపీఎం నాయకులు జగన్, తదితరులు

వేపాడ: జిల్లాలోని గిరిజనుల సమగ్రాభివృద్ధికి ఎస్.కోటలో ఐటీడీఏ(ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్మెంట్ ఏజెన్సీ) సంస్థను ఏర్పాటు చేయాలని సీపీఎం నేత చల్లా జగన్ డిమాండ్ చేశారు. మండలంలోని కొండగంగుబూడి, చిట్టివానిపాలెం, కోటయ్యగరువు, బందవలస గ్రామాలకు చెందిన గిరిజనులతో కొండగంగుబూడిలో శనివారం ఆందోళన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉమ్మడి విజయనగరం జిల్లాకు సంబంధించిన ఐటీడీఏ పార్వతీపురంలో ఉండేదని, పార్వతీపురంను ప్రత్యేక జిల్లా చేయడంతో ఐటీడీఏ పార్వతీపురం జిల్లాలో ఉండిపోయిందన్నారు. విజయనగరం జిల్లాలోని వేపాడ, శృంగవరపుకోట, గంట్యాడ, బొండపల్లి, మెంటాడ, కొత్తవలస, తదితర మండలాల్లో ఉన్న గిరిజనులకు ఎటువంటి ప్రత్యేక సదుపాయాలు లేవని అన్నారు. 1/70 చట్టం అమలు కాకపోవడం, ఐటీడీఏ పరిధిలో లేకపోవడంతో చదువుకున్న గిరిజన యువకులకు ఉద్యోగాలు దక్కక నిరుద్యోగులుగా ఉండిపోతున్నారన్నారు. జిల్లాలో 8 శాతం ఉన్న గిరిజనులు ఆదుకోవాల్సిన బాధ్యత అధికారులు, ప్రభుత్వంపై ఉందని అన్నారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ జ్ఞానదీపిక

గజపతినగరం రూరల్: అధికారులు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషితోనే మండలంలో మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు శాఖల వారీ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. గ్రామీణ నీటిపారుదలశాఖ ఏఈ నాని మాట్లాడుతూ మండలంలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింట కుళాయిల ఏర్పాటు పనులకు రూ.14 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఒక్కో గ్రామానికి రూ.25 లక్షల వరకు వెచ్చించిపనులుచేసేందుకు టెండర్లను పిలిచామని చెప్పారు. ఎంఈఓ విమలమ్మ మాట్లాడుతూ మండలంలో 65 పాఠశాలలు ఉన్నాయని, వీటిలో 58 పాఠశాలల్లో రెండు విడతల్లో నాడు–నేడు పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. అలాగే జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించేలా చూస్తున్నామన్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని, అన్ని గ్రామాల్లోనూ ప్రభుత్వ భవనాల నిర్మాణం పూర్తయ్యిందని చెప్పారు. పార్టీలకు అతీతంగా పథకాలను పారదర్శకంగా అందిస్తున్నామని తెలిపారు. జెడ్పీటీసీ గార తవుడు, ఎంపీడీఓ ప్రసాద్, వైస్ ఎంపీపీ కర్రి దేవి, మండల నాయకులు బెల్లాన త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

• ఎంపీపీ కల్యాణి

పూసపాటిరేగ: విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. శనివారం స్థానిక ఓక్‌ల్యాండ్ పాఠశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ప్రయోగాల ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేటి పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థీ సైన్స్‌పై అవగాహన పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. శాస్త్రసాంకేతిక అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు బి. పాపునాయుడు, రాజ్‌కుమార్, ఓక్‌ల్యాండ్ కరస్పాండెంట్‌సీహెచ్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సీహెచ్. రవి, ఎస్సై ఎ. సన్యాసినాయుడు, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, సర్పంచ్ బొంపల సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

గరిష్ట వేతనం అందేలా పనులు చేయాలి



వేతనదారుల మస్తర్లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఏపీఓ నరేంద్రకుమార్

మెరకముడిదాం: ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట వేతనం అందేలా వేతనదారులతో ఉపాధి పనులు చేయించాలని ఇన్‌చార్జి ఏపీఓ నరేంద్రకుమార్ రాచగుమడాం ఫీల్డ్ అసిస్టెంట్ సూర్యనారాయణ, మేట్లకు సూచించారు.

మండలంలోని రాచగుమడాం గ్రామం పెద్ద బోగిన చెరువులో చేపడుతున్న పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మస్తర్ల సీట్లను తనిఖీ చేసి, 28 శ్రమశక్తి సంఘాలకు చెందిన 213 మంది వేతనదారులు పనులకు హాజరవుతున్నట్లు గుర్తించారు. వేతనదారులతో మాట్లాడుతూ రోజుకు ప్రభుత్వం నిర్దేశించిన వేతనం రూ.272 వచ్చేవిధంగా పనులు చేయాలన్నారు. పని ప్రదేశంలో నీడకోసం టెంట్లు వేయాలని, మెడికల్ కిట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలని మేట్లకు సూచించారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి



లబ్ధిదారులతో సమావేశమైన మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ

వేపాడ: గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ లబ్ధిదారులకు సూచించారు. హౌసింగ్‌డేలో భాగంగా మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం లో గృహ లబ్ధిదారులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్‌లో 55 మందికి, సొంత స్థలాలు ఉన్న 64 మందికి ఇళ్లు మంజూరు చేశామన్నారు. మొత్తం 119 ఇళ్లలో 69 నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగతావి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయని వారు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. హౌసింగ్ ఏఈ అప్పలనాయుడు, ఐకేపీ ఏపీఎం శ్రీనివాసరావు, ఎంపీటీసీ గంగతల్లి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

వేపాడ మండలం బొద్దాం గ్రామానికి చెందిన 22 మందికి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఎస్.కోటలోని తన క్యాంప్ ఆఫీస్‌లో శనివారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు.వైఎస్సార్‌సీపీ నాయకులు జె.హరిబాబు, జె.జగ్గారావు పాల్గొన్నారు. – శృంగవరపుకోట



బొద్దాం గ్రామస్తులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

శివారు కాలనీలకు తాగునీరు

• డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



తాగు నీటి కుళాయిలు ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నగర ప్రజలకు ఇచ్చిన హామీమేరకు శివారు కాలనీలు, ప్రాంతాలకు సైతం కార్పొరేషన్ ద్వారా కుళాయిలు ఏర్పాటు చేసి మంచినీరు సరఫరా చేస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 42 డివిజన్ కాళీఘాట్ కాలనీలో ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయిలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శనివారం ప్రారంభించారు. స్థానికులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ పిన్నింటి కళావతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పిన్నింటి సూర్యనారాయణ, డివిజన్ పార్టీ అధ్యక్షుడు ఆరికతోట తిరుపతిరావు మాట్లాడుతూ.. తమ డివిజన్‌లో ఎన్నడూ లేనంత అభివృద్ధి కోలగట్ల వీరభద్రస్వామి నేతృత్వంలో జరిగిందన్నారు. రానున్న ఎన్నికలలో కోలగట్లను మరోసారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధితోనే ప్రగతి



విద్యార్థులకు కిట్‌లు అందజేస్తున్న బద్దుకొండ ప్రదీప్ నాయుడు, మజ్జి సిరిసహస్ర

పూసపాటిరేగ: విద్యాభివృద్ధితోనే ప్రగతి సాధ్యమవుతుందని వైఎస్సార్ సీపీ నాయకులు బద్దుకొండ ప్రదీప్‌నాయుడు, మజ్జి సిరిసహస్ర అన్నారు. మండలంలోని గోవిందపురం, పూసపాటిరేగ, రావాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శనివారం పరీక్ష కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారులు పాపినాయుడు, రాజ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు మహంతి సీతాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.